క్లుప్తంగా

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ



గ్రామసభలో పనుల గుర్తింపుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధి సిబ్బంది

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కె.వెంకటాపురంలో గ్రామసభ నిర్వహించి రైతులు, గ్రామానికి ఉపయోగపడేలా పనులు గుర్తించాలని వివరించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం పనుల గుర్తింపు కోసం గ్రామసభలు జరుగుతున్నాయని, గ్రామస్తుల ఆమోదం మేరకు తీర్మానం చేస్తామని తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పలు నేల వేషాలు ఏర్పాటు చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియతో పాటు మరో ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులు హాజరౌతారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణ మృతి

రాంబిల్లి : పెదకలవలాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మడగల రమణ గురువారం మృతి చెందారు. రమణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామస్తులు రమణ మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

వైఎస్సార్ బీమా ఆర్థిక సాయం పంపిణీ



మృతురాలు కుటుంబానికి నగదు సాయం అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో వేంపాడులో అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా అంత్యక్రియల కోసం రూ.10 వేల నగదును గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన దేనుకొండ రామసీత అనే మహిళ అనారోగ్యంతో మరణించారు. ఈమె కుటుంబీకులు వైఎస్సార్ బీమా సాయం కోసం దరఖాస్తు చేసుకోగా తక్షణ సాయం కింద అంత్యక్రియల కోసం రూ.10వేలు మంజూరయ్యాయి. ఈ నగదును సర్పంచ్ ఏడిద నూకరత్నం, వార్డు సభ్యుడు అయినంపూడి సురేష్ కుమార్‌లు మృతురాలి కుటుంబానికి అందజేశారు.

అపరిశుభ్ర బాత్‌రూమ్‌లు

ప్రైవేట్ స్కూల్‌కు నోటీసులు

పాయకరావుపేట : పట్టణంలో గల చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యంకు నోటీసులు జారీ చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీ తెలిపారు. చైతన్య టెక్నో స్కూల్లో 1250 మంది విద్యార్థులు ఉన్నారని, కానీ బాత్‌రూమ్స్ సరిగా లేవన్నారు. టాయిలెట్స్ బేసిన్స్ చిట్లి పోయాయన్నారు. నీటి సదుపాయం కూడా సక్రమంగా లేదన్నారు. గతంలో కూడా టాయిలెట్స్ విషయమై హెచ్చరించినా పాఠశాల యాజమాన్యంలో మార్పు రాలేదన్నారు. అందువల్ల దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.

డిగ్రీ కళాశాలలో తీరిన అధ్యాపకుల కొరత

- ఎమ్మెల్యే చొరవతో 13 మంది అధ్యాపకుల నియామకం
- జగనన్న ప్రభుత్వ హయాంలోనే కళాశాల మంజూరు
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం



జూనియర్‌కళాశాలలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల

నక్కపల్లి: దాదాపు నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల ఏర్పాటుకు మోక్షం కలిగించిన ముఖ్యమంత్రి జగనన్న విద్యార్థుల బోధనకు అవసరమైన అధ్యాపకులను కూడా నియమించారు. తాజాగా డిగ్రీ కళాశాలలో 13 మంది అధ్యాపకులను నియమించారు. దీంతో విద్యార్థుల్లోనూ వారి తల్లిదండ్రుల్లోను హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే పాయకరావుపేట నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల లేదు. సుమారు 40 ఏళ్ల నుంచి నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గతంలో ఈ ప్రాంతంలో ఎన్నికల పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డిలతోపాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వంగలపూడి అనిత సయితం నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేసేస్తున్నట్టు ప్రకటించారు. తీరా ఎన్నికల్లో గెలిచి పదవీ కాలం అయిపోయినా సరే కళాశాల మాత్రం మంజూరు చేయలేదు.

ఎన్నికల ముందు పాదయాత్ర చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు విషయం తీసుకెళ్లారు. కోటవురట్లలో జరిగిన బహిరంగ సభలో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని జగనన్న ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం పదవి చేపట్టిన ఏడాదిలోపే నక్కపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. 2020–21 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల లోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. బీఎస్సీ గణితం, బీఎస్సీ బాటనీ, బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కోర్సులు ప్రారంభించారు. సుమారు 150 మంది విద్యార్థులు ఈ కాలేజీలో అడ్మిషన్లు పొందారు. అయితే తరగతులు ప్రారంభమయ్యాయి కానీ పూర్తి స్థాయి అధ్యాపకులను మాత్రం నియమించలేదు. దీంతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇదే విషయాన్ని మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో తాజాగా డిగ్రీ కళాశాలకు 11 అధ్యాపక పోస్టులు (గణితం, చరిత్ర, ఫిజిక్స్, కెమిస్ట్రీ బాటనీ, జూవాలజీ, కంప్యూటర్స్, తెలుగు, ఇంగ్లిష్, కామర్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్, సబ్జెక్టులకు) అధ్యాపక పోస్టులను నియమించారు.

గెస్ట్ లెక్చరర్ విభాగంలో వీరిని నియమించారు. అలాగే మరో రెండు అధ్యాపకేతర పోస్టులు కూడా నియమించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య తెలిపారు. దీంతో రెండేళ్లుగా ఇక్కడ నెలకొన్న బోధనా సిబ్బంది కొరత తీరిందని ఆయన చెప్పారు. తమ పిల్లలకు పూర్తి స్థాయిలో డిగ్రీ బోధన అందించేందుకు అధ్యాపకుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎమ్మెల్యే బాబూరావుకు కళాశాల తరఫున విద్యార్థులు వారి తల్లితండ్రుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

సీఎం జగనన్న దయతో



నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన నక్కపల్లిలో డిగ్రీ కళాశాల సీఎం జగనన్న దయతో ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. బోధనా సిబ్బందిని కూడా తాజాగా నియమించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలకు నూతనంగా సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. నిధులు మంజూరు చేశారు. నక్కపల్లిలో జాతీయ రహదారి పక్కన ఉన్న వారపుసంత వెనుక,కేజీబీవీ పాఠశాల సమీపంలో నూతన భవనాలు నిర్మిస్తాం.

– గొల్లబాబూరావు, ఎమ్మెల్యే

ప్రత్యేక కృషి



ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రత్యేక కృషితో నక్కపల్లిలో డిగ్రీ కళాల ఏర్పాటయింది.అలాగే బోధనా సిబ్బందిని కూడా నియమించారు.దీంతో సిబ్బంది కొరత తీరింది. విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ శివయ్య, ప్రిన్సిపాల్, డిగ్రీకళాశాల

ఎంతో మేలు కలిగింది



రెండేళ్లనుంచి ఇక్కడ అధ్యాపకులు లేక సరైనబోధన జరగలేదు. కంప్యూటర్స్ బోధించే సిబ్బంది లేక ఇబ్బంది పడ్డాం. సీఎం జగనన్న, ఎమ్మెల్యే బాబూరావుల కృషితో తాజాగా అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించారు. చాలా ఆనందంగా ఉంది. చాలా దూరం వెళ్లి డిగ్రీ చదవాల్సి వచ్చేది. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు కలిగింది.

– తనూజ, విద్యార్థి

ఈ రాష్ట్రానికి జగనే కావాలి

ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



అచ్యుతాపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండలంలోని గృహ సారథులు,సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఈ కార్యక్రమ విధి విధానాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో శతశాతం విజయవంతం అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 11 నుంచి ఈ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం అవుతుందని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఈ కార్యక్రమం కీలకం అవుతోందని తెలిపారు. కార్యక్రమం విధి విధానాలను వివరించారు. కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, మండల పార్టీ నాయకులు కోన బుజ్జి, జేసీఎస్ మండల కన్వీనర్ రాజాన విజయ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, దేశంశెట్టి శంకర్‌రావు, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన

మునగపాక : మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) పర్యటన జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' అనే కార్యక్రమంపై సమావేశం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే 11 గంటలకు తోటాడ సచివాలయ పరిధిలో హైస్కూల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొంటారన్నారు.

ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల ప్రత్యేకాధికారి మంజులావాణి,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు.జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,సర్పంచ్ కర్రి అప్పయమ్మ, ఎంపీటీసీ కర్రి నానిబాబు, మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ శ్వేత పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు



దేవవరంలో గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి : వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. దేవవరంలో పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన కార్యక్రమం నిర్వాహకులు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. భారీ ఊరేగింపులు, నేల వేషాలు, బాణాసంచాతో గణపతి నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, యువకులు, గణపతి బప్పా మోరియా అంటూ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పాయకరావుపేట : నేడు (శుక్రవారం) పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో గల 3311 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో గల 11 కేవీ తాండవ షుగర్ ఫ్యాక్టరీ ఫీడర్ విద్యుత్ తీగలు మార్చుట వల్ల ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి : పరవాడ నుంచి కోరుప్రోలు వరకు 132 కేవీ లైనుకు మరమ్మతు, నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ప్రత్యామ్నాయం ఉన్నచోట ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా ఉంటుదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

146 మందికి ఉచిత కంటి పరీక్షలు

మునగపాక : తిమ్మరాజుపేటలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక సత్యసాయిబాబా ఆలయ ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరానికి 146 మంది రోగులు హాజరయ్యారు. వారిలో 33 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ అధికారి వరహాలు, ఫౌండేషన్ క్యాంపు డిప్యూటీ మేనేజర్ ఎం .అరుణ్‌కుమార్, క్యాంపు కో–ఆర్డినేటర్ అశ్వనీకుమార్, నర్సింగ్ స్టాఫ్ గంగమ్మ, సత్యసాయిబాబా భజన మండలి సభ్యులు అప్పలనాయుడు, సాయిరామ్, ఆదిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మహనీయుల విగ్రహాలు



పాఠశాల ఆవరణలో దేశనాయకుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో నెల్లిపూడి పాఠశాలలో సర్పంచ్ కొలుకులూరి సురేష్‌వర్మ కృషితో జాతీయ నేతల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, మదర్ థెరిస్సా, టంగుటూరి ప్రకాశం పంతులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పారు. ఈ విగ్రహాలను విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో సర్పంచ్ సురేష్ వర్మ, ఎంపీటీసీ సభ్యుడు తంగెళ్ల కృష్ణ, ఎంఈవో కుంచం నరేష్, నాయకులు కురందాసు నాని, ఎస్.గోవిందు తదితరులు ఆవిష్కరించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలను తెగించి పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకు వచ్చిన దేశ నాయకులతో పాటు, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ మహనీయుడి త్యాగాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఇటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు మంచి నడవడిక, విద్యాబుద్ధులు నేర్చుకుని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.

సేవాభావంతో మన్ననలు పొందుతున్న వలంటీర్లు



ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛను నగదు అందిస్తున్న రమ్య

కోటవురట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని వలంటీర్లు తమ సేవా గుణంతో నెరవేరుస్తున్నారు. వలంటీర్లుగా తమ పరిధిలోని కుటుంబాలకు అండగా ఉంటూ ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్నారు. గతంలో పింఛను నగదు కోసం ఎన్ని కష్టాలు పడేవారో తెలిసిందే. ఇపుడు అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండగా ఒకటో తేదీనే తలుపుతట్టి మరీ పింఛను నగదు అందిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే అనారోగ్యంతో బాధపడుతూ దూర ప్రాంతాలలో ఉన్నవారికి కూడా వలంటీర్లు పింఛను అందజేసి మన్ననలు పొందుతున్నారు. కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రావాడ రమణమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దాంతో వలంటీరు దేవాడ రమ్య రానుపోను సుమారు 240 కిలోమీటర్లు ప్రయాణించి పింఛను నగదు అందజేసింది. మహిళా వలంటీర్లు సైతం సుదూరంలో వున్న లబ్ధిదారులకు పింఛను అందజేయడం వారి సేవా భావానికి దర్పణం పడుతోంది.

పూడిమడకలో జగనన్న ఆరోగ్య సురక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రాష్ట్ర ప్రజలందరికి ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా చూడడమే సీఎం లక్ష్యమని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు.అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లోని అన్ని ఇళ్లకు వెళ్లి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారని తెలిపారు.తద్వారా శిబిరానికి విచ్చేసిన వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి,అత్యవసర వైద్యం అవసరమైన వారిని పెద్దాసుపత్రులకు సిఫారసు చేస్తారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ చేపల సుహాసిని, చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. సుమారు 400కి పైగా స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

475 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు వైద్యం కోసం పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట : మండల అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో పాల్మన్‌పేటలో జగనన్న సురక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో గల కొర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాలకు చెందిన 475 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, గుండెకు సంబంధించిన సమస్యలు, స్త్రీలకు గైనిక్ సమస్యలను వైద్యులు పరిశీలించారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పలువురికి కంటి శస్త్ర చికిత్సలను సిఫార్సు చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ వి.అనూష స్త్రీలకు గైనిక్ పరీక్షలు నిర్వహించారు. ఎం.మాధవి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పి.కావ్య, డాక్టర్ వి.పద్మప్రియ రోగులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు, సలహాలు అందించి, మందులు అందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.సౌజన్య పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, మత్స్యకార నాయకుడు మైలపల్లి అశోక్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో కార్పొరేట్ స్థాయి వైద్యం



జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



నాడు నేడు నిర్మాణంలో పాఠశాల భవనాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యం మంచి ఆరోగ్యం కావాలని కోరుకునే వ్యక్తుల్లో మొదటి వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేయించడం జరుగుతోందని తెలిపారు. దీర్ఘకాల వ్యాధులకు స్పెషలిస్టులతో వైద్య పరీక్షలు చేయించి మందులు ఇచ్చే జగనన్న సురక్ష ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో వైద్యం అందుకుని అదనపు వైద్యం చేయించుకోవాలన్నా..వైద్య సిబ్బంది ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు తరలించి వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, రఘునాథరాజు, వర్మరాజు , అచ్చుతరామరాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వైద్యులు రాజేశ్వరి, వాసంతిలతో ఎముకల వైద్య నిపుణులు, గైనకాలజీ వైద్యులు అందుబాటులోనికి వచ్చి వైద్య పరీక్షలు అందించారు.

నాడు నేడు పనులు పరిశీలన

గుడివాడ గ్రామంలో కోటి రూపాయలకు పైగా కేటాయించి ఉన్నత పాఠశాలలో చేపట్టిన నూతన భవన నిర్మాణాలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సందర్శించారు. పనులు వేగవంతం చేయాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, శ్రీపతిరాజు, మాజీ జెడ్పీటీసీ కొణంకోట నీలేంద్రరావు పాల్గొన్నారు.

నక్కపల్లి: పేదల సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న రక్ష కల్పిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గురువారం ఆయన రేబాకలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడారు.

ఇక్కడ ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే డాక్టర్లతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ఏడురకాల వైద్య పరీక్షలను ఇక్కడ ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేబాక, తిరుపతి పాలెం, రమణయ్యపేట, రేవళ్ల గ్రామాలకు చెందిన సుమారు 600 మందికి వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కాసుబాబు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పల్లపు ఆనందపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొడ్డేడ ప్రసాద్



వృద్ధురాలి ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. పల్లపు ఆనందపురంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల ప్రత్యేకాధికారి మంజులావాణి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ అప్పయమ్మ, ఎంపీటీసీ నానిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, వైద్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పల్లపు ఆనందపురంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు.

వెల్చూరులో...

రాంబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వెల్చూరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు .చంద్రబాబు పాలనలో పీహెచ్‌సీల్లో వైద్యులు, మందులు లేక ప్రజలు నానావస్థలు పడేవారని, జగనన్న పాలనలో ప్రజల ఆరోగ్యానికి భరోసా దక్కిందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, సచివాలయ మండల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.



వెల్చూరు వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు శ్రీరామరక్షగా మారిందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మండలంలో కృష్ణాపురం గ్రామంలో గురువారం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అటు విద్య, ఇటు వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. మేనిఫెస్టోలో పొందుపరచని ఎన్నో పథకాలు ముఖ్యమంత్రి జగన్ అమలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజా సంక్షేమమే అజెండాగా పాలన సాగిస్తున్న జగనన్నకు ప్రజలంతా తోడుండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో దొంగల ముఠా వస్తుందని, వారి మాటలు నమ్మొద్దని హితవు పలికారు. అసలైన పెద్ద దొంగ బాబు జైలుకెళ్లడంతో లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. వారికి రాబోయే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, తహల్దార్ రాణి అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు రాము, ఎర్రయ్యదొర, త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



రామచంద్రపాలెంలో జేఏఎస్ వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీటీసీ రాంబాబు, అధికారులు

కోటవురట్ల : ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని ఎంపీటీసీ పెట్ల రాంబాబు అన్నారు. రామచంద్రపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీటీసీ పెట్ల రాంబాబు ప్రారంభించారు. రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలనే లక్ష్యంతో వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటా వైద్య సేవలు అందుతుండగా భారీ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సేవలను మెరుగుపరుస్తూ ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. విద్యకు సాయం చేస్తూనే వైద్య పరంగా ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ మాట్లాడుతూ ఈ శిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. స్థానిక వైద్య సిబ్బందితో పాటు ప్రత్యేక వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉంటున్నారన్నారు. టోకెన్లు తీసుకున్నవారు మాత్రమే కాకుండా లేని వారు కూడా శిబిరాలకు వచ్చి చికిత్స చేయించుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నబాబు, వైద్యులు కె.సుదీప్, బి.మౌనిక, ఎంపీహెచ్ ఈవో గోవిందరావు, ఆరోగ్యమిత్ర కుసుమరాణి, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.